

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

గురువారం | 9 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 8


## ఆరోగ్యకరమైన తల్లి – ఆరోగ్యకరమైన కుటుంబం, బలమైన సమాజానికి పునాది



- తల్లి ఆరోగ్యం – ప్రజారోగ్య వ్యవస్థకు అద్దం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 08 (ప్రజాజ్యోతి) : ఆరోగ్యకరమైన తల్లి – ఆరోగ్యకరమైన కుటుంబం, బలమైన సమాజానికి పునాది అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద మూడో రోజు జిల్లా స్థాయి

మిగతా 2 లో...





# సేవలు సున్నా.. సైకో పాలన ఫుల్..?


- హాస్పిటల్‌లో సేవలే లేవు.. సిబ్బందిపై టార్గెట్ గేమ్..?
- నిధుల కొరతనా..? లేక నిర్వాహక లోపమా..?
- ప్రభుత్వ ఆస్పత్రి పేరుతో ప్రైవేట్ దారి..? ప్రజల గగ్గోల
- సేవల లోపంపై ప్రజల ఆగ్రహం.. నిధుల కొరతపై వైద్యాధికారి వాదన

పర్వతగిరి, ఏప్రిల్ 08 (ప్రజాజ్యోతి) పర్వతగిరి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం వివాదాల కేంద్రంగా మారింది. ఒకవైపు ప్రజలు, సిబ్బంది తీవ్ర ఆరోపణలు చేస్తుండగా, మరోవైపు మండల వైద్యాధికారి డాక్టర్ నిధుల కొరతను కారణంగా చూపుతూ తనవైపు వివరణ ఇవ్వడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. ప్రజలు, స్థానిక వర్గాల ఆరోపణల ప్రకారం, పీహెచ్‌సీ లో గర్భిణీ స్త్రీలకు నార్మల్ డెలివరీలు సక్రమంగా నిర్వహించడంలో లోపాలు ఉన్నాయని, వేసెక్టమీ వంటి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల క్యాంపులు నిర్వహించకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యాలు దెబ్బతింటున్నాయని విమర్శిస్తున్నారు. హైడ్రోసిల్ వంటి కనీస శస్త్రచికిత్సలు కూడా చేయలేని పరిస్థితి నెలకొనడం వల్ల ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సిబ్బంది వర్గాలు వైద్యాధికారిపై మరింత తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందిని మధ్యలోనే తిరిగి పిలిపించడం, హాస్పిటల్‌కు వచ్చిన తర్వాత గంటల తరబడి వేచి ఉండమని ఆదేశించడం వంటి చర్యలు విధుల

మిగతా 2 లో...

## నల్లాల బావి నీటి చౌర్యం .. అధికార పార్టీ నేతల అక్రమ సాగు!

- గ్రామస్తులకు చుక్కనీరు కరువు.. వరి పొలానికి యథేచ్ఛగా పంపింగ్.
- చర్యలు తీసుకోవాలని ఖాదర్‌పేట గ్రామస్తుల డిమాండ్.





చెన్నారావుపేట ఏప్రిల్ 8 (ప్రజా జ్యోతి) వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామంలో అధికార పార్టీ నాయకుల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వేసవి కాలంలో గ్రామస్తుల గొంతు ఎండిపోతుంటే, ప్రజాప్రతినిధులు మాత్రం ఊరి ఉమ్మడి నీటిని తమ సొంత ప్రయోజనాల కోసం మళ్లించుకుంటున్నారు. గ్రామానికి తాగునీరు అందించాల్సిన నల్లాల బావి నీటిని అధికార పార్టీ నాయకుడు, గ్రామ సర్పంచ్ భర్త గూడ మహేందర్ తన అనుచరుడైన మరో రైతు వరి పొలానికి అక్రమంగా తరలిస్తూ నీటి శౌర్యం (చౌర్యం) చేస్తున్నారు. గత వారం రోజులుగా గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోవడంతో మహిళలు, వృద్ధులు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను గాలికి వదిలేసిన సర్పంచ్ భర్త, అధికార బలంతో నల్లాల బావి నుండి నీటిని మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తూ తన స్నేహితుడి పొలానికి మళ్లిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా

మిగతా 2 లో...

## వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి, ఎమ్మెల్యే నాగరాజు

- అస్తవ్యస్త పరిస్థితులపై ఆగ్రహం – నిర్లక్ష్య సిబ్బందిపై కలెక్టర్ చర్యలకు ఆదేశాలు..



వర్ధన్నపేట ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి వరంగల్ జిల్లా, వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణలో కనిపిస్తున్న అస్తవ్యస్త పరిస్థితులు మరియు సిబ్బంది నిర్లక్ష్యంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వయంగా

మిగతా 2 లో...

## చింతగట్టు శివారులో పీడీఎస్ బియ్యం డంప్ పట్టివేత..

- రూ.7 లక్షల విలువైన 200 క్వింటాళ్లు స్వాధీనం..
- ఒకరు అరెస్ట్.. ఇద్దరు పరారీలో..



హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08 ప్రజాజ్యోతి.. హనుమకొండ జిల్లా చింతగట్టు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం డంప్‌ను టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. దాడుల్లో రూ.7 లక్షల విలువైన 200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు దాడి నిర్వహించగా 68 గన్నీ సంచులు, 348 తెలుపు సంచులు కలిపి మొత్తం 416 సంచుల్లో బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. కేసులో ఒర్సు భాను (34) అనే వ్యక్తిని అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితులు మోటం మధుకర్, చిట్టారి ఎర్రగట్టు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసిన బియ్యం నిందితుడిని తదుపరి చర్యల కోసం కె యూ సి పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఏఎస్ ఐ సుధాకర్ పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి, ఎమ్మెల్యే నాగరాజు



(మొదటి పేజీ తరువాయి...)


ఆసుపత్రిలోని బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన పలువురు వైద్యులు మరియు సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారికి వెంటనే మెమోలు జారీ చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని వార్డులు మరియు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను పిలిచి అక్కడికక్కడే మందలిస్తూ, రోగులు నయం కావాల్సిన ఆసుపత్రి వాతావరణం ఇంత అపరిశుభ్రంగా ఉండటం అనేది అసహనీయమని పేర్కొన్నారు. వెంటనే పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని, లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆసుపత్రి వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, సిబ్బంది స్పందన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలు అందించే కేంద్రాలుగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## నల్లాల బావి నీటి చౌర్యం .. అధికార పార్టీ నేతల అక్రమ సాగు!

(మొదటి పేజీ తరువాయి...)

సాగుతున్న ఈ తతంగంతో బావిలో నీటి మట్టం అట్టడుగుకు చేరుకుంటోంది. ఊరి ప్రజలకు నీళ్లివ్వాల్సిన వారే ఇలా నీటిని దొంగిలించడం ఏంటని? గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలు ఉన్నాయనే ధీమాతోనే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని బాహాటంగానే విమర్శిస్తున్నారు. ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన నీటిని వ్యక్తిగత లాభం కోసం వాడుకుంటున్న సర్పంచ్ భర్త గూడ మహేందర్‌పై మరియు అతనికి సహకరించిన వారిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపించాలని గ్రామస్థులు డిమ్యాండ్ చేస్తున్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



**కొడకండ్ల, ఏప్రిల్ 08 ( ప్రజాజ్యోతి ):** జనగామ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధర్మారం బిక్షపతి–కోమలత దంపతుల కుమారుడు శ్రవణ్ కుమార్ మినిశ్రీ వివాహం బుధవారం జరగగా వివాహానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమరు గొమ్ముల వెంగళరావు. కొడకండ్ల మండలంలోని గ్రామ సర్పంచులు గిరగాని క్రాంతి కుమార్ గౌడ్, మొండ్రాయి గ్రామ సర్పంచ్ గునిగంటి వెంకన్న, కడగుట్ట తండ సర్పంచ్ భూక్య యాకూబ్, పాల్గొన్నారు. ఉప సర్పంచులు కప్పల రంగయ్య, భూక్య వీర్య నాయక్, కొడకండ్ల మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వనం మోహన్, దేశగాని నాగరాజు,ఐతరాజు హాజరయ్యారు. మండల నాయకులు మసరం మనోహర్, గుండెబోయిన ఉప్పలయ్య తదితరులు పాల్గొనీ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సేవలు సున్నా.. సైకో పాలన ఫుల్..?

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహణ కాదని, కక్ష సాధింపు చర్యలేనని వారు ఆరోపిస్తున్నారు. డ్యూటీ పేరుతో వేధింపులు, ఆదేశాల పేరుతో అవమానాలు జరుగుతున్నాయని సిబ్బంది గుసగుసలాడుతున్నారు. అదేవిధంగా, సిబ్బంది పలకరించినా స్పందించకపోవడం, దిగువ సిబ్బందిని గౌరవించకపోవడం, నా స్థాయి ఆర్డీఓ, డీఎస్పీతో సమానం అంటూ అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
పీహెచ్‌సీ అధికారిక గ్రూపుల్లో సాధారణ మెసేజ్‌లకు స్పందించకపోయినా చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. గతంలో ఒక మహిళా సిబ్బందిపై ఇదే తరహా ఒత్తిడి కారణంగా ఆమె దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి, అనంతరం బదిలీ పొందాల్సి వచ్చిన ఘటనను సిబ్బంది గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం కూడా అలాంటి పరిస్థితులే పునరావృతమవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్, పర్వతగిరి పీహెచ్‌సీకి ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం నుండి సరైన నిధులు అందడం లేదు. ఆస్పత్రి నిర్వహణ కోసం అవసరమైన చిన్నచిన్న ఖర్చులను కూడా నా వ్యక్తిగత డబ్బుతోనే భరిస్తున్నాను అని తెలిపారు.
వనరుల కొరత కారణంగా కొన్ని సేవల్లో లోపాలు ఉండవచ్చని, అయినప్పటికీ ఆస్పత్రి నిర్వహణకు తన వంతు కృషి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. నిధుల కొరత నిజమైతే ప్రభుత్వం స్పందించకపోవడానికి కారణం ఏమిటి? లేకపోతే సేవల లోపానికి బాధ్యత ఎవరిది? సిబ్బంది ఆరోపణల్లో ఎంతవరకు నిజం ఉంది? అనే అంశాలపై స్పష్టత అవసరం ఉంది. పర్వతగిరి పీహెచ్‌సీ చుట్టూ నెలకొన్న ఈ వివాదం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని ప్రజలు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

## ఆరోగ్యకరమైన తల్లి – ఆరోగ్యకరమైన కుటుంబం, బలమైన సమాజానికి పునాది

(మొదటి పేజీ తరువాయి...)

సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమ వర్క్ షాప్ ను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లి ఆరోగ్యం అనేది కేవలం ఆరోగ్య సూచిక మాత్రమే కాకుండా, ప్రజారోగ్య వ్యవస్థకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఇది కేవలం గణాంకాల పరిమితి కాదని, సమగ్ర అభివృద్ధికి సూచికగా భావించాలన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో భారతదేశంలో మాతా–శిశు మరణాల తగ్గింపులో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఇంకా మెరుగైన చర్యలు అవసరమని తెలిపారు. జిల్లా స్థాయిలో మాతా–శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీలను త్వరగా గుర్తించడం, సమయానికి వారికి నాణ్యమైన సేవలు అందించడం ప్రధానమన్నారు. ప్రతి గర్భిణీ మహిళను ప్రారంభ దశలోనే నమోదు చేయడం, నియమిత గర్భధారణ పరీక్షలు (ఏఎన్ సి), హీమోగ్లోబిన్ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, పోషకాహార సలహాలు, ఐరన్, ఫోలిక్ ఆమ్ల మాత్రలను సరఫరా చేయడం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రక్తహీనత, రక్తపోటు, గర్భకాల మధుమేహం వంటి సమస్యలను సబ్ సెంటర్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో సమర్థంగా గుర్తించాలన్నారు. జనని సురక్ష యోజన, జనని శిశు సురక్ష కార్యక్రమం, లక్ష్య వంటి పథకాలు తల్లి–శిశు ఆరోగ్య సేవలను విస్తరించాయని, ఇవి ప్రతి ఆరోగ్య కేంద్రంలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గర్భధారణ నుంచి ప్రసవం వరకు, ప్రసవానంతర కాలం వరకు నిరంతర సేవలు అందించడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రసవం తర్వాత తొలి 48 గంటలు అత్యంత కీలకమైనవి అయినందున ఆ సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. తల్లి ఆరోగ్య పర్యవేక్షణ, తల్లిపాలు పట్టడం, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. తల్లీబిడ్డలు మెరుగైన వైద్య సేవలు పొందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషణ, ప్రసూతి సేవల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మాతృ మరణాలను తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గర్భిణీకి సమయానుకూలంగా వైద్య పరీక్షలు, అవసరమైన పోషకాహారం, టీకాలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రతి గర్భిణీ సురక్షిత ప్రసవం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సాధారణ ప్రసవాల శాతాన్ని మరింతగా పెంచాలన్నారు. అలాగే ప్రజలకు సాధారణ ప్రసవాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అన్ని పీహెచ్సీలు, సీహెచ్సీలలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రసూతి మరణాలు, పిల్లల మరణాలు ఎక్కడా కూడా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రుల్లో లేబర్ రూంలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లాలో తల్లి ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెంచి, సురక్షిత మాతృత్వం సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు మాతా–శిశు సంరక్షణపై, పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ అమలు, సాధారణ ప్రసవాల పెంపు, పోషకాహారం, తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీసీహెచ్ఎస్ నరేందర్ శర్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, డీడబ్ల్యూఓ కోదండరాములు, ప్రోగ్రామింగ్ అధికారి డా. శ్రీహర్ష, గైనకాలజిస్ట్ లు డా. సునీత, డా. అపర్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, వైద్యాధికారాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ఇస్సిపేట గ్రామంలో అంగడి ప్రారంభం



**ప్రజాజ్యోతి –మొగుళ్లపల్లి (ఏప్రిల్ 08)** మండలం లోని ఇస్సిపేట గ్రామంలో వారాంతపు అంగడి గ్రామస్తులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామ సర్పంచ్ యారా ముకుంద రెడ్డి , ఎంఆర్ఓ సునీత రెడ్డి, ఎంపిఓ సుభాష్ చంద్రబోస్, ఎస్సై ఎం సురేష్ లు అన్నారు. బుధవారం అంగడిని గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్సిపేట గ్రామంలో ప్రతి బుధవారం అంగడి నిర్వహించడం వల్ల గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరిగి లాభం చేకూరుతుందన్నారు. గ్రామంలో ప్రజలకు అందరికీ మంచి జరగాలనే ఉద్దేశంతో ఈ అంగడిని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామస్తులు దూర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలు వివిధ రకాల సరుకులను కొనుగోలు చేసేందుకు వెళ్లడానికి ఎంతో ఇబ్బంది పడే బాధలు తప్పాయని గ్రామస్తులు ఎలాంటి ఇబ్బందలు పడవద్దని ఉద్దేశంతో ఈ సంత ఏర్పాటు చేయడం జరిగిందని అంతేకాకుండా అధిక ఖర్చు కూడా అయ్యేదని ఇప్పుడు అలాంటి బాధ లేకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ సరుకులను కొనుగోలు చేసేందుకు గ్రామంలో ప్రారంభించామన్నారు. ఈ సంతాలో అన్ని రకాల సరుకులు దొరుకుతాయని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఈ సంతా ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బత్తిని శ్రీధర్ గౌడ్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎండి రఫీ, తక్కలపల్లి రాజు, మాజీ ఎంపీపీ యారా సుజాత సంజీవరెడ్డి మరియు వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తాటి చెట్టు మీది నుండి పడి గీతా కార్మికుడికి గాయాలు





**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 08** గణపురం మండల కేంద్రానికి చెందిన గీతా కార్మికుడు నాయకపు రఘుపతి గౌడ్ బుధవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం రఘుపతి రోజువారిగా తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్ళాడు. తాటి చెట్టు ఎక్కుతుండగా కాలుతో ఉన్న గుయ్యి. జరగడంతో కిందపడ్డాడు. అక్కడే ఉన్న తోటి గీతా కార్మికులు రఘుపతి నీ లేపి చికిత్స నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. రఘుపతికి కాలుకు. చెయ్యికి. తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ గీత కార్మికున్ని ఆదుకోవాలని గణపురం మండలం గీతా పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు మార్క మొగిలి. బూర రాజగోపాల్. మాదాసు అర్జున్. మార్క కుమార్. కేజీ కేఏస్ గౌరవ అధ్యక్షులు బత్తిని శివశంకర్ గౌడ్. మాదాసు రవి గౌడ్. గడ్డమీద రవి గౌడ్. మార్క కొమురయ్య గౌడ్. డిమాండ్ చేశారు

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్

- వడ్డేపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం
- పదేళ్లలో పడకేసిన పనులకు శ్రీకారం చుట్టాం



**హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వడ్డేపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన వడ్డేపల్లి ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం 60వ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లిలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బల్దియా గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., గత పదేళ్లలో వడ్డేపల్లి అభివృద్ధి కోసం ఎలాంటి కృషి జరగలేదని, ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. దవాఖాన, స్మశాన వాటిక, అంతర్గత రహదారులు, సైడ్ డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిని దశలవారీగా చేపట్టామని పేర్కొన్నారు.అభివృద్ధి కార్యక్రమాలలో రాజకీయ పక్షపాతం ఉండదని, అన్ని డివిజన్‌లలో సమానంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బీజేపీ, బి ఆర్ ఎస్ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులపైనా ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు.గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఉన్నప్పటికీ అభివృద్ధికి సరైన సహకారం అందలేదని విమర్శించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలోనే ప్రతి డివిజన్‌కు సమపాళ్లలో నిధులు కేటాయించి, అభివృద్ధి పనులను వేగవంతం చేశామని తెలిపారు. పూర్తి గ్రామీణ వాతావరణం కలిగిన వడ్డేపల్లి, శాయంపేట, సోమిడి ప్రాంతాలను నగరంలోని ప్రధాన కాలనీలకు దీటుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని, ప్రతి కుటుంబానికి మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలి

- చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి
- డిబిఎఫ్ నాయకులు




**హసన్‌పర్తి,ఏప్రిల్ 8(ప్రజాజ్యోతి):** ఉపాధి కూలీలకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండుటెండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్న కూలీలకు ఇప్పటికీ కూలీ రాకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం మండలంలోని సీతంపేట గ్రామంలో మహానీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సామాజిక పరివర్తన ప్రచారంలో భాగంగా చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టం అమలు సరిగా జరగడం లేదని ఆరోపించారు. కూలీల హక్కులను కాపాడేందుకు ప్రవేశపెట్టిన జాతీయ చరవాణి పర్యవేక్షణ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ ఆశ కార్యకర్తల సహకారంతో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.అలాగే ప్రతి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉపాధి చట్టాన్ని రక్షించుకుంటూనే కొత్తగా తీసుకొచ్చిన గ్రామ జీవన విధాన చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కూలీలను కోరారు.ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ, మండల ప్రధాన కార్యదర్శి అడేపు రమ, ఆశ కార్యకర్తలు మంత్రి రమ, నద్దునూరి రజితతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ విజయ చందర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు




**హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08 ప్రజాజ్యోతి** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు బుధవారం రోజున హన్మకొండ రెడ్ క్రాస్ సొసైటీ కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా నిర్వహించినారు. ముందుగా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గసభ్యులు పూల మొక్క అందచేసి శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసినారు. తరువాత రెడ్ క్రాస్ సిబ్బంది పుష్పగుచ్చం అందచేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం పరకాల నియోజకవర్గ కార్యకర్తలు బొకేలు, శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసినారు. పాలకవర్గ సభ్యులు డాక్టర్: కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ చైర్మన్ విజయ చందర్ రెడ్డి పాలకవర్గ సభ్యులకు చేదోడు వాడుగా ఉంటూ అందరిని కలుపుకొని పోతూ ప్రజలకు సేవ చేసే రెడ్ క్రాస్ కార్యక్రమాలలో ముందు ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాగంటి శేషుమాదవ్ మాట్లాడుతూ.. స్వతహాగా ఆర్థోపెడిక్ డాక్టర్ మరియు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కొనసాగుతూ అనేక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ తో పాటు లయన్స్ క్లబ్ లో ఉంటూ అనేక సేవ కార్యక్రమాలలో పాల్గొన్నారని అన్నారు. డాక్టర్. జె. కిషన్ రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ తో పాటుగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గా ఉంటూ తెలంగాణా అన్ని జిల్లాలో క్రికెట్ అభివృద్ధి జరిగే విదంగా చూస్తున్నారని అన్నారు. ఈ సందర్బంగా డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ పాలకవర్గ సబ్యులకు, రెడ్ క్రాస్ సిబ్బంది మరియు పార్టీ అభిమానులను కృతజ్ఞతలు తెలియచేసినారు. ఇకముందు కూడా పేదలకు సేవ చేసే కార్యక్రమాలలో ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. మొహమ్మద్ తహర్ మసూద్, కొగిల్వాయి గ్రామ చుక్క వనిత మహేందర్ , గురజాల శ్రీరామ్ రెడ్డి, జంగిలి నాగరాజు, ఆత్మకూరు మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, పరకాల రూరల్ మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్, సంగెం మండల అధ్యక్షులు దామెరుప్పుల చంద్రమౌళి,16వ డివిజన్ అధ్యక్షులు ప్రసన్న రాంప్రసాద్, 17 వ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్, మొలుగూరి శ్రీనివాస్ మరియు రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఐఖ్య డిజిటల్ ప్రింటింగ్ హబ్ ప్రారంభం

- హనుమకొండ డిసిసి అధ్యక్షులు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 08 ప్రజాజ్యోతి** హనుమకొండ నయీంనగర్ శరణ్య హాస్పిటల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఐఖ్య డిజిటల్ ప్రింటింగ్ హబ్ ను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు వ్యాపారస్తులకు అత్యాధునిక డిజిటల్ ప్రింటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన నిర్వాహకులను ఇనగాల అభినందించారు. ఈ హబ్ లో ఫ్లెక్స్ ప్రింటింగ్, యువీ డిజిటల్ ప్రింటింగ్, బ్యానర్ బుక్ ప్రింటింగ్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## ప్రింటింగ్ హబ్ ను ప్రారంభించిన నాగుర్ల



**హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08 ప్రజాజ్యోతి** హనుమకొండ నయీమ్ నగర్ లోని శ్రీ ఐక్య డిజిటల్ ప్రింటింగ్ హబ్ ను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి అవసరానికి హైదరాబాదుకు వెళ్లకుండా.. మన హనుమకొండ నగరం నడి ఒడ్డున అన్ని రకాల ప్రింటింగ్ ముఖ్యంగా టీ షర్ట్స్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ ప్రింటింగ్, నేమ్ ప్లేట్స్ ప్రింటింగ్, వివిధ రకాల వస్తువులపై వారికి నచ్చినటువంటి ప్రింటింగ్, ఫ్లెక్సీ, ఈకో సాలియంట్, యు వి, ఎల్ ఈడి,సిఎంసి,లేజర్,ఫోటో ఫ్రేమ్స్,డెకరేషన్ ఐటమ్స్ కు సంబంధించినటువంటి వివిధ రకాల ప్రింటింగ్ ను అందరికీ అందుబాటులో ఉండే విధంగా, సరసమైన ధరలలో ఇక్కడ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ప్రింటింగ్ హబ్ ప్రొప్రైటర్ విక్రమ్, బెస్ట్ వాయిస్ ఎడిటర్ కొడగాని మోహన్ రావు కు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామం నుంచి ప్రారంభమైన భూమిహైర్

- రైతులకు టెక్నాలజీతో కొత్త దారి

**చిగురుమామిడి ఏప్రిల్ 08 (ప్రజా జ్యోతి)** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ప్రారంభమైన భూమిహైర్, వ్యవసాయ రంగంలో ఒక వినూత్న మార్పును తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది.నేటి వ్యవసాయంలో యంత్రాల అవసరం పెరుగుతున్నప్పటికీ, అవి సమయానికి అందుబాటులో లేకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా భూమిహైర్ రైతులు మరియు యంత్ర యజమానులను ఒకే ప్లాట్ ఫామ్‌లో కలుపుతోంది.ఈ ప్లాట్ ఫామ్ ద్వారా రైతులు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, డ్రోన్ స్ప్రేయింగ్, బోర్‌వెల్ సేవలను అద్దెకు సులభంగా పొందగలుగుతున్నారు. దగ్గరలో ఉన్న యంత్రాలను మాత్రమే చూపించడం వల్ల ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు తగ్గి, పనులు వేగంగా పూర్తవుతున్నాయి.ఇక యంత్ర యజమానులు కూడా తమ యంత్రాలను అద్దెకు ఇచ్చి అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈ విధంగా భూమిహైర్ వ్యవసాయ రంగంలో సమర్థవంతమైన కనెక్షన్‌గా పనిచేస్తోంది.గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులు యాప్‌పై ఆసక్తి చూపిస్తూ నమోదు అవుతున్నారు. ఈ సేవ ఇప్పటికే గ్రామస్థాయిలో మంచి స్పందన పొందుతోంది.యాప్‌ను ఉపయోగించడానికి గూగుల్‌లో భూమి హైర్ కం అని సెర్చ్ చేసి రిజిస్టర్ అవ్వాలి. అవసరమైన సేవలను సులభంగా బుక్ చేసుకోవచ్చు.మరిన్ని వివరాల కోసం సోషల్ మీడియాలో భూమి హైర్ అని సెర్చ్ చేసి ఫాలో అవ్వవచ్చు.సంప్రదించడానికి ఫోన్: 7337291961భవిష్యత్తులో ఈ సేవను మరింత ప్రాంతాలకు విస్తరించి, రైతులకు సమయానికి సేవలు అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో ఒక పెద్ద మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో భూమిహైర్ ముందుకు సాగుతోంది.





# వరంగల్-కొండపర్తి ఆర్టీసీ కొత్త బస్సు సర్వీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు





**ఐనవోలు /వర్ధన్నపేట ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి**

హన్మకొండ జిల్లా, ఐనవోలు మండలం పరిధిలోని పలు గ్రామాల ప్రజలు గత కొద్ది రోజులుగా తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు సంబంధిత ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. దీనికి స్పందించిన ఆర్టీసీ అధికారులు వరంగల్ నుంచి కొండపర్తి వరకు కొత్త బస్సు సర్వీస్‌ను వయా తిమ్మాపూర్, సింగారం, నర్సింహుల గూడెం, ముల్కలగూడెం గ్రామాల మీదుగా నడిపేలా ఏర్పాట్లు చేశారు. నేడు ప్రారంభమైన ఈ బస్సు సర్వీస్‌ను ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మరియు వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదా దేవి..ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ,ఈ బస్సు సర్వీస్ ద్వారా తిమ్మాపూర్, సింగారం, నర్సింహులగూడెం, ముల్కలగూడెం తదితర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు మరియు సాధారణ ప్రజలకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ బస్సు సర్వీస్ వెళ్లే మార్గంలోని గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అలాగే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఇప్పటికే భారీగా లాభం చేకూరిందని చెప్పారు. ఇప్పటి వరకు మహిళల ఉచిత ప్రయాణాల ద్వారా సుమారు 290 కోట్ల ప్రయాణాలు జరిగాయని, దాదాపు 10 వేల కోట్ల రూపాయల మేర మహిళా ప్రయాణికుల చార్జీల ఆదా జరిగినట్లు ఆయన వెల్లడించారు.మహిళలకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు వారికి సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే నాగరాజు గారు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రవాణా సౌకర్యాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.ఎమ్మెల్యే నాగరాజు కృషితో వరంగల్ నుంచి కొండపర్తి వరకు తిమ్మాపూర్, సింగారం, నర్సింహుల గూడెం, ముల్కలగూడెం గ్రా మాల మీదుగా కొత్త బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. నేడు ఈ బస్సు సర్వీస్ ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ తమ గ్రామానికి ఎన్నో ఏండ్లుగా ఉన్న బస్సు ప్రయాణ కలను నెరవేర్చిన ఎమ్మెల్యే నాగరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా స్పందిస్తూ తమ గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించినందుకు ఎమ్మెల్యే నాగరాజు గారికి గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ బస్సు సర్వీస్ వల్ల గ్రామాల ప్రజలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ నా యకులు, ఆర్టీసీ అధికారులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరి బడి- మన పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది

- జెడ్‌పీహెచ్‌ఎస్ ల్యాబర్తి పాఠశాలలో బడిబాట కరపత్రం విడుదల



**వర్ధన్నపేట ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి** వర్ధన్నపేట మండలం, జడ్పీహెచ్ఎస్ ల్యాబర్తి ఉన్నత పాఠశాలలో బడిబాట కరపత్రాన్ని బుధవారం మండల విద్యా అధికారి శ్రీధర్, జిల్లా ఎస్.ఓ విజయ్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగం శైలు నాయకత్వంలో ఉపాధ్యాయులు ఐక్యతతో మనబడి పిలుస్తుంది అనే శీర్షికతో ముందస్తుగా బడిబాట కరపత్రాన్ని ప్రచురించి, 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి చేస్తున్న ఈ కృషి ప్రశంసనీయమని అన్నారు.గత సంవత్సరం బడిబాట కార్యక్రమంలో భాగంగా వినూత్న పద్ధతులతో విద్యార్థుల నమోదు పెంపులో పాఠశాల సాధించిన పురోగతిని గుర్తుచేశారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, డీఈవో జ్ఞానేశ్వర్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల కృషిని అభినందించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య.




**రాయపర్తి, ప్రజా జ్యోతి** కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి వెన్నంపల్లి శ్రీనివాస్, సర్పంచ్ గారే సాహెంద్ర బిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు దిటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసిందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. అనంతరం ఇటీవల గురుకుల పాఠశాలలో సిటు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ గారే కృష్ణమూర్తి, రిటైడ్ హెడమాస్టర్ రావుల భాస్కర్ రావు, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయిలు శర్మ, ఏవిఆర్ చార్యులు, తహేస్తా తఫిమ్, స్వాతి, శ్రీదేవి,మురళి, నరేష్,వివేక్, రాజేంద్రప్రసాద్, తల్లింద్రులు వెంకన్న, వెంకట్ స్వామి,మహేందర్,యాకయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో ఆగని అక్రమ నిర్మాణాలు

- కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న గిరిజన సంఘాలు?





**ఏటూర్ నాగారం ఏప్రిల్ 08 ప్రజా జ్యోతి** ఏటూర్ నాగారం, మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద సర్వే నంబర్ 222లో ఉన్న 15 గుంటల ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాలకు గురవుతున్నట్లు గిరిజన సంఘాల నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో భూ కబ్జాదారులు భారీ ముడుపులు చెల్లించి ఈ భూమిని ఆక్రమించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. గుంటకు రూ.45 లక్షల వరకు విక్రయాలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని తెలిపారు.ఈ వ్యవహారం వెనుక భూ మాఫియా చురుకుగా పనిచేస్తోందని, ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మకాల దందా నడిపిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం మరియు 5వ షెడ్యూల్ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నారని గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి.ఈ అంశంపై ములుగు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించగా, కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌పై ఆగ్ర హం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, కేవలం నామ మాత్ర సర్వే చేసి భూమిని స్వాధీనం చేసుకున్నట్లు చూపిస్తూ, హద్దులు ఏర్పాటు చేయకుండా అక్రమ నిర్మాణాలకు మార్గం సుగమం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నోటీసులు పంపడంలోనే పరిమితమై అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇక వందలాది ఎకరాల చెరువు శిఖం భూములు కూడా గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లి, రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎల్టీఆర్ జడ్జ్మెంట్ ఉన్నప్పటికీ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. ఎల్ టి ఆర్ జడ్జిమెంట్ అనుకూలంగా వచ్చిన పంచనామా నిర్వహించిన దాఖలాలు లేవని అన్నారు.భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను రక్షించాలని, 1/70 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. చట్టాలను తుంగంలో తొక్కి తమ ఇష్టానుసారంగా i అధికారులు వ్యవహరిస్తున్నారని. దశల వారీగా ఆందోళన కార్యక్రమంలు చేపడతామని ఆదివాసీ సంఘాల నాయకులు వాపోతున్నారు.

**నిభందనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి**

**తుడుం దెబ్బ ములుగు డివిజన్ అధ్యక్షులు పోడెం శోభన్**

ఆదివాసి చట్టాలను తుంగంలో తొక్కి ఏజెన్సీ గ్రామీ ణ ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. గిరిజనేతరులు ప్రభుత్వ భూములు కబ్జా చేసి బహుళ అంతస్తుల నిర్మాణం చేస్తున్న రక్షించాల్సిన అధికారులు. కబ్జా దారులకు కొమ్ము కాస్తూ భక్షిస్తున్నారు అవినీతి పాల్పడిన అధికారుల పై చర్యలు తీసుకోవాలీ.

## జీడికల్ సీతారామచంద్రస్వామి హుండీ లెక్కింపు ఒక లక్ష ఆరువై ఐదు వేల ఏడు రూపాయలు

**లింగాల గణపురం, ఏప్రిల్, 8 (ప్రజాజ్యోతి )**మండలంలోని జీడికల్ గ్రామంలో బుధవారం సీతారామచంద్రస్వామి దేవాలయం ఉండి లెక్కింపు ఒక లక్ష ఆరువై ఐదు వేల ఏడు రూపాయలు ఆదాయం వచ్చింది ఈ సందర్భంగా దేవాలయ ఈవో వంశీ మాట్లాడుతూ గత సంవత్సరం 1,42,000 రూపాయల రాగా ఈ సంవత్సరం 21 వేల రూపాయలు అధికంగా వచ్చాయని తెలిపారు కార్యక్రమంలో ఈవో చలపతి, దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ మూర్తి,ఆలయ సిబ్బంది భారత్, మల్లేష్, శంకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాజ్యోతి -మొగుళ్లపల్లి (ఏప్రిల్ 08)**మండలంలోని ఇస్సి పేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి నిరంజన్ పెద్ద వాగు నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బుధవారం ఇస్సిపేట గ్రామపంచాయతీ వద్ద పట్టుకున్నారు. ఈ సందర్భంగా అతనిపై కేసు నమోదు చేసి, ఇసుకతో ఉన్న ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# వినూత్న సృజనతో రావి ఆకు పై నో డ్రగ్స్

- **అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు**







**ఏటూర్ నాగారం ఏప్రిల్ 08 ప్రజా జ్యోతి** ఏటూర్ నాగారం మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమం పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ దేవర రమేష్ వినూత్న సృజనతో ఆకట్టుకున్నారు. రావి ఆకును కాన్వాస్‌గా మార్చి “నో డ్రగ్స్ ” అనే సందేశాన్ని లీఫ్ ఆర్ట్ రూపంలో అద్భుతంగా డిజైన్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా యువతకు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో, అదే సందేశాన్ని సృజనాత్మకంగా ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో రమేష్ ఈ ప్రత్యేక కళాఖండాన్ని రూపొందించారు. రావి ఆకుపై సూక్ష్మంగా చెక్కిన “” నో డ్రగ్స్" ఆర్ట్ విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది రమేష్ ప్రతిభను కొనియాడుతూ, ఇలాంటి సామాజిక సందేశాలను కళారూపంలో ప్రదర్శించడం విద్యార్థుల్లో చైతన్యం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు.విద్యార్థులు కూడా ఈ వినూత్న ఆర్ట్‌ను ఆసక్తిగా వీక్షిస్తూ, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవడం విశేషం. రమేష్ చేసిన ఈ ప్రయత్నం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలిచింది.

## బస్సు సర్వీసును వినియోగించుకోండి

- **తొర్రూరు డిఎం : పద్మావతి**




**కొడకండ్ల, ఏప్రిల్ 8 (ప్రజాజ్యోతి ):** తొర్రూరు నుండి ఉప్పల్ ఎక్స్ రోడ్ వరకు నూతనంగా ప్రారంభించిన బస్సు సర్వీసును వినియోగించుకోవాలని తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి బుధవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు తొర్రూరు నుండి బయలుదేరి తొర్రూరు, నాంచారి మడూరు, గంట్లకుంట్ల, కొడకండ్ల, మొండ్రాయి, దేవరుప్పుల, జనగామ మీదుగా ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు చేరుకుంటుందని తెలిపారు. కావున ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి వారి సౌకర్యార్థం మరిన్ని బస్సు సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## తరగతి గదిలోనే కూలిపోయిన గురువు

- **చంద్రశేఖర్‌కు కన్నీటి నివాళులు**



**పర్వతగిరి, ఏప్రిల్ 08 (ప్రజాజ్యోతి )**పర్వతగిరి మండలంలోని టూక్య నగర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ తరగతి గదిలోనే గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోశాల చంద్రశేఖర్ దశదినకర్మ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. సంగెం మండలం కాట్రపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పర్వతగిరి మండల విద్యాశాఖ పక్షాన అధికారులు, ఉపాధ్యాయులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల కోసం అంకితభావంతో పనిచేసిన చంద్రశేఖర్ గారి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం విద్యా రంగానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి, పర్వతగిరి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ నవీన్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు, పర్వతగిరి పాఠశాల ఉపాధ్యాయులు మహంకాళి రామస్వామి, ఇస్లావత్ తండా పాఠశాల హెడ్ మాస్టర్ బొలిగొడ్డు శ్రీధర్, ఎంఆర్సీ సిబ్బంది గారె జయరాజ్, ఉపాధ్యాయులు కోతుల కుమారస్వామి, దామెర రాజశేఖర్, బస్కే రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో నీటి ఎద్దడి నివారణ చర్యలు

- **డీపీఓ కొండ వెంకయ్య**



**మంగపేట ఏప్రిల్ 08 ప్రజాజ్యోతి** వేసవి కాలంలో గ్రామాలలో ప్రజలకు నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (మంగపేట మండల ప్రత్యేక అధికారి) కొండ వెంకయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మంగపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.బద్రు అధ్యక్షతన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా పంచాయతీ అధికారి కొండ వెంకయ్య మండల ప్రత్యేక అధికారి హాజరై అనంతరం మాట్లాడుతూ వేసవిలో ఏ ఒక్క గ్రామంలో కూడా నీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని తెలిపారు. గ్రామాలలో నీటి సమస్య ఉందని తెలిస్తే తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. మండలంలోని మంగపేట, మల్లూరు, రాజుపేట గ్రామాలలో ఉన్న లాడ్జీలకు ట్రేడ్ లైసెన్స్ తో పాటు నిర్వాహకుల నుండి ప్రభుత్వ నిభందనల మేరకు ట్యాక్స్ వసూలు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న వాటర్ ప్లాంట్స్ ను తనిఖీ చేసి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలని, నిభందనలకు విరుద్ధంగా ఉన్న వాటర్ ప్లాంట్స్ ను సీజ్ చేయాలని ఆదేశించారు. గ్రామాలలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని, విధులలో నిర్లక్ష్యంగా ఉండవద్దని, గ్రామాలలోని సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్భా పాఠశాలను సందర్శించి తగిన సూచనలు అందించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నయాబ్ తహశీల్దార్ గా ఇమామ్ బాబా షేక్



**మహాముత్తారం,ఏప్రిల్ 8. ప్రజా జ్యోతి**మహాముత్తారం మండల నూతన న యాబ్ తహశీల్దార్ గా ఇమామ్ బాబా షేక్ బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు.ఇక్కడ పని చేసిన సందీప్ మల్హార్ మండలానికి బదిలీ అయ్యారు.

## కెనాల్ (కాలువ) భూసేకరణ కు రైతులతో గ్రామసభ సమావేశం

- **రెవెన్యూ అధికారులు**
- **అభ్యంతరాలు సలహా సూచనలు సేకరణ**
- **నయాబు తాసిల్దార్ (భూసేకరణ) త్రినాద్ రెడ్డి**



**గాయపర్తి ఏప్రిల్ 8 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలనుపల్లి గ్రామంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వరంగల్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నష్కల్ నుండి వచ్చు కెనాల్ (కాలువ )కొరకు భూసేకరణ గురించి గ్రామ సర్పంచ్ వంగాల ఎల్లమ్మ యాకయ్య అధ్యక్షతన కొలనపల్లి గ్రామపంచాయతీ వద్ద గ్రామసభ నిర్వహించడం జరిగినది. గ్రామసభలో నాయబ్ తహసిల్దార్ (భూ సేకరణ విభాగం ) త్రినాద్ రెడ్డి , ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ పాల్గొని రైతులకు కెనాల్ కాలువకు సంబంధించి సందేహాలు నివృత్తి చేసి అభ్యంతరాలను స్వీకరించారు. ఆరెగూడెం మరియు జయరామ్ తండా సర్పంచులు బి యాకయ్య, ఎన్ శిల్పా నరేష్, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులు గారు ఆర్ ఐ చంద్రమోహన్ , పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామ పాలన ఆఫీసర్ బి సదానందం, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి

- **జిల్లా రెవెన్యూ అధికారి ( డి ఆర్ వో )విజయలక్ష్మి**

**రాయపర్తి ఏప్రిల్ 8 ప్రజాజ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి తహసిల్దార్ కార్యాలయమును జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి బుధవారం సందర్శించి, జనాభా లెక్కల సర్వే – 2027 గురించి తహసిల్దార్ కార్యాలయంలో మండల తహసిల్దార్ ఎం శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిషన్ నాయక్ మరియు మండల విద్యాధికారి శ్రీనివాస్, ఎం పీ ఎస్ ఓ కళ్యాణ్, మండల సర్వేయర్ వీరస్వామి, గిర్ధవార్లు చంద్రమోహన్, సంధ్యారాణి తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జనాభా లెక్కల సర్వేకు కావలసిన ఎనిమరేటర్లు, సూపర్వైజర్లు జనాభా ప్రాతిపదికన త్వరగా నియమించి వారికి శిక్షణా తరగతులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



## అంగన్వాడీ కేంద్రాలలో సురక్షిత మాతృత్వ కార్యక్రమం




**మహాముత్తారం,ఏప్రిల్ 8. ప్రజాజ్యోతి** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సురక్షిత మాతృత్వ కార్యక్రమమును మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలకు రిజిస్ట్రేషన్లు,చెకప్ లు చేసి అవగాహన కల్పించారు.అదే విధంగా మహాముత్తారంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కొండగొర్ల బాపు, మెడికల్ ఆఫీసర్ దీప్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏ ఎన్ ఎం లు సరోజన, భారతి, ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించిన మున్నూరుకాపు సంఘము నాయకులు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 08** గణపురం మండల కేంద్రానికి చెందిన సిరంగి కుమార్ సతీమణి సిరంగి లావణ్య గత కొద్దీ రోజుల క్రితం మరణం చెందడం జరిగింది. కావున గణపురం గ్రామ మున్నూరు కాపు పరపతి సంఘం ఆధ్వర్యంలో సభ్యులు అందరూ కుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు సంఘం తరపున వారి కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణపురం మండల మున్నూరుకాపు సంఘము అధ్యక్షులు పుప్పాల దీపక్ పటేల్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ పటేల్, పటేల్ సభ్యులు ఆవుల రవి కిరణ్ పటేల్ సిరంగి సుదయ పటేల్ బొట్ల రాజు పటేల్ సిరంగి భద్రయ్య పటేల్ విడిదినేని శంకర్ పటేల్ తోట నవీన్ కుమార్ పటేల్ పత్తెం రాజు పటేల్ సుంకరి రమేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వదువరులను ఆశీర్వదించిన నాయకులు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 08** గణపురం మండల కేంద్రానికి చెందిన బానోత్ రాజునాయక్ రమ దంపతుల కుమార్తె పూజిత (వర్షిత) దిలీప్ కుమార్ వివాహవేడుకలకు హాజరై నూతన జంటను ఆశీర్వదించిన గణపురం మండల మున్నూరు కాపు సంఘము అధ్యక్షులు పుప్పాల దీపక్ పటేల్ వారి వెంట మాజీ ఉపసర్పంచ్ గిట్ల తిరుపతి పరిశ్రమికవేత్త లింగంపల్లి చందర్ రావు విడిదినే శంకర్ దేవిశెట్టి రామకోటయ్య పెద్దపెల్లి రమణచారి బూర రాజగోపాల్ గౌడ్ మార్క శ్రీనివాస్ గౌడ్ బత్తుల రవి జీడీ రమేష్ అశోక రవీంద్రనాయక్ తదితరులు వున్నారు.

## అతి పురాతన విగ్రహం లభ్యం

- కాలభైరవ స్వామిగా పూజలు





**నల్లబెల్లి ఏప్రిల్ 08,(ప్రజా జ్యోతి):** మండలంలోని గుండ్లపహాడ్ అభయాంజనేయ స్వామి ప్రక్కన ఎన్నో ఏళ్లుగా భూమిలో కూరుకుపోయిన అతి పురాతనమైన శ్రీ కాల భైరవ స్వామి విగ్రహాన్ని హనుమాన్ మాలధారణ స్వాములు పడాల ఆదిత్య స్వామి ఆధ్వర్యంలో బయటకు తీశారు ఈ విగ్రహాన్ని చుసేందుకు గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు హనుమాన్ స్వాములలను గ్రామస్తులు అభినందించారు. ఇట్టి మహాత్కర్యాంలో స్వాములు గుండెబోయిన సునీల్ , ఊరటి శ్రీకాంత్ , మనుబోతుల సంతోష్, అనంతగిరి రవికుమార్ , బొల్లెబోయిన కోటి తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ తూర్పు డిగ్రీ కళాశాలలో మెగా ఆరోగ్య శిబిరం




**వరంగల్ సిటీ, ఏప్రిల్ 8(ప్రజాజ్యోతి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ వద్ద గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్, వరంగల్ ఈస్ట్‌లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం మెగా మెడికల్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జడ్జి నిర్మల గీతాంబ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. శిబిరంలో భాగంగా వరంగల్ మెడికవర్ ఆసుపత్రి నుండి వచ్చిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ అమతుల్ హెచ్ పి వి టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సీనియర్ డెంటిస్ట్ డాక్టర్ తబసుమ్ అఫ్ష దంత ఆరోగ్యంపై విలువైన సూచనలు అందించారు. అలాగే వారి సాంకేతిక బృందం రక్తంలో చక్కెర స్థాయి, రక్తపోటు (బీపీ), హీమోగ్లోబిన్ వంటి పలు పరీక్షలను నిర్వహించింది. ఇదే క్రమంలో నర్సంపేట నుండి కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ ఐశ్వర్య, ఈ ఎన్ టి వైద్యురాలు డాక్టర్ మౌనిక, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ అహ్మద్ హాజరై సేవలు అందించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, రంగశాయిపేట నుండి డాక్టర్ రమ్య బృందం పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, ఔషధాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకొని ప్రయోజనం పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. రాధిక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. సునీత మరియు అధ్యాపక బృందం వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ఆరోగ్య పర్యవేక్షకురాలు డాక్టర్ భగవతిని ప్రిన్సిపల్ అభినందిస్తూ, ఇలాంటి ఆరోగ్య శిబిరాలు విద్యార్థుల సంక్షేమానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై వేగం పెంచాలని అధికారుల సూచన

- ఏఈ సౌజన్య, కార్యదర్శి తిరుమల్ రెడ్డి



**తరిగొప్పుల(ప్రజాజ్యోతి )ఏప్రిల్:08** తరిగొప్పుల: ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారి ఏఈ సౌజన్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి మామిడి తిరుమల్ రెడ్డి లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వారు పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. స్లాబులు పడిన వాటికి కల్లర్లు వేసి గృహప్రవేశాలకు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుంకు అంజయ్య మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకుని ప్రతి కుటుంబం సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బెజ్జం భవానీ రవి, ఇందిరమ్మ లబ్ధిదారులు శతార్ల రేణుక రాజు, కోంద్ర సుమలత నర్సింలు, బొమ్మెన రేణుక రాజు, ఎండబట్ల స్వప్న అశోక్, జిడికంటి కనుకయ్య, కోంద్ర కనుకయ్య, దోమకొండ జ్యోతి యేసు, ఎండబట్ల పరమేశ్, కాసుల స్రవంతి రాంబాబు, వగలబోయిన సుహాసిని రాజు, కందుల మధు, గట్టుపల్లి ఎల్లవ్వ నర్సింలు, తాళ్లపల్లి సాంబయ్య, మల్యాల రమ రాజు, కోట రాజు, వంగపల్లి శిరీష నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోటారు ఏర్పాటుతో తీరిన నీటి కష్టాలు

- బోరు బావికి నూతన మోటారు ఏర్పాటు
- నీటిని వృథా చేయొద్దు సర్పంచ్



**నల్లబెల్లి, ఏప్రిల్ 8(ప్రజాజ్యోతి ):** మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. గ్రామంలోని అంగోతు కోటియా ఇంటి సమీపంలో ఉన్న బోరు బావికి గ్రామ ప్రజల సౌకర్యార్థం బుధవారం నూతన మోటారు సెట్‌ను ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా ఇక్కడ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతుండటంతో గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త మోటారును అమర్చి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సపావట్ కవితా దేవు నాయక్ మాట్లాడుతూ. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీరు ఎంతో అమూల్యమైనదని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని వాడుకోవాలే తప్ప వృథా చేయకూడదని ఆమె సూచించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బానోతు మంగణ, సపావట్ యాకన్న, గ్రామ కరోబార్ శ్యాంసుందర్, పంచాయతీ సిబ్బంది యాకయ్య, కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కొత్త మోటారు ఏర్పాటుతో నీటి సమస్య తీరడంపై స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది

- పి ఆర్ టి యూ జిల్లా అధ్యక్షులు మందల తిరుపతి రెడ్డి
- 40 ఏళ్ల సేవలకు ముగింపు
- కూచన సరళదేవికి ఘన సన్మానం



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 08(ప్రజాజ్యోతి ):** ఇటీవల పదవి విరమణ పొందిన ఐనవోలు ప్రభుత్వ పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ కూచన సరళదేవి పదవి విరమణ కార్యక్రమం హంటర్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ వేడుకల గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి, సరళదేవిని శాలువా, స్మారక చిహ్నాలతో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు పదవి విరమణ వృత్తి పరంగా మాత్రమేనని, వారి సేవలు సమాజానికి జీవితకాలం కొనసాగుతాయని పేర్కొన్నారు. మరొక ముఖ్య అతిథి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల తర్వాత గురువు అత్యంత ప్రాధాన్యమైన వ్యక్తి అని, విద్య ద్వారానే వ్యక్తి వికాసం, భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయ వృత్తేనని కొనియాడారు. ఈ సందర్భంగా ఐనవోలు మండల విద్యాశాఖాధికారి పులి ఆనందం మాట్లాడుతూ, సరళదేవి 40 సంవత్సరాల పాటు నిబద్ధతతో చేసిన సేవలను ప్రశంసించారు. సన్మాన గ్రహీత కుచన సరళదేవి మాట్లాడుతూ, తన ఉపాధ్యాయ వృత్తిలో సహకరించిన సహచర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, సహచర ఉపాధ్యాయులు మరియు ఆహ్వానితులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

- **సంఘమిత్ర కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్**

**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 8**

విద్యార్థి దశ నుండే నైతిక విలువలు పెంపొందించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని భూపాలపల్లి సంఘమిత్ర కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ లో సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాల 21వ వార్షికోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఏ. హరికృష్ణ ఆధ్వర్యంలో, కరస్పాండెంట్ గుర్రపు రవీందర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్, తేజస్విని జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బిల్ల రాజిరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, నైతిక విలువలు పెంపొందించుకొని మీ గురువులు, తల్లిదండ్రులు గొప్పగా చెప్పుకునేలా ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ యువత రాజకీయ రంగంలోకి రావాలని, విద్యార్థి దశ నుండే రాజకీయ అనుభవాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్సులు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ మొగిలి, రాజశేఖర్, రాజు, ప్రవీణ్, భూపాల్ రెడ్డి, ఆనంద్ ,మమత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## అంబేద్కర్ విజినరీ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- **యవత ఏకగ్రీవ నిర్ణయం.. అధ్యక్షుడిగా గద్దల ప్రశాంత్**



**చెన్నారావుపేట ఏప్రిల్ 08 (ప్రజా జ్యోతి)**గ్రామ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకమని ఆ దిశగా యువత ఐక్యంగా ముందుకు సాగాలని గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్ అన్నారు మండల పరిధిలోని పాత మొగ్దుంపురం గ్రామంలో సోమవారం అంబేద్కర్ విజినరీ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో యువత అంతా కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా గద్దల ప్రశాంత్ ఉపాధ్యక్షుడిగా అల్వాల శ్రీ పాల్, ప్రధాన కార్యదర్శిగా పరికి నవీన్ లు ఎన్నికయ్యారు. వీరు ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరిస్తూ గ్రామ ప్రగతికి, యువత సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఎన్నికల అనంతరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అసోసియేషన్ నూతన లోగోను నాయకులు, యువత కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉపసర్పంచ్ అల్వాల శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి, వార్డు మెంబర్ జన్ను రమేష్,మాదాసి రమేష్, ఎండి పెరోజ్, మాదాసి రాజేందర్, మాదాసు సునీల్, సుంకరి కత్తి, ఎస్.కె ఫిరోజ్, మాదాసి చింటు, అల్వాల కిక్కు తదితరులు పాల్గొన్నారు.

## సికెయం ఆసుపత్రిలో ఘనంగా సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహణ





**వరంగల్, ఏప్రిల్ 08(ప్రజాజ్యోతి ):**ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి ఆరోగ్యం కుటుంబానికి పునాది అని పేర్కొన్నారు. తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పోషకాహారం, సమయానుకూల వైద్య పరీక్షలు, సురక్షిత ప్రసవం ఎంతో అవసరమని వివరించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే తల్లి–శిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలోని ఓపీ విభాగం మరియు ఇతర వార్డులను సందర్శించారు. గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, అక్కడ చికిత్స పొందుతున్న మహిళలతో మాట్లాడి సేవల నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వైవి గణేష్, సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు మరియు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## నవదంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**చెన్నారావుపేట ఏప్రిల్ 08 (ప్రజా జ్యోతి )**మండల కేంద్రంలోని శంకరంతండా గ్రామపంచాయితీ పరిధిలోని వాయిల్ తండాలో బుధవారం జరిగిన వివాహ వేడుకకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన జరుపుల కీమా కుమార్తె అలివేలు మంగమ్మ – రాజుల వివాహ మహోత్సవానికి విచ్చేసిన ఆయన, నూతన వధూవరులను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. శుభకార్యాల్లో పాల్గొని ప్రజలతో మమేకం కావడం సంతోషంగా ఉందన్నారు. వివాహ వేడుకకు హాజరైన ఆయనకు వధువు కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న,ఎన్నికల కన్వీనర్ మాజీ ఎంపీపీ జక్కా అశోక్, మండల యువ నాయకులు భూక్య శ్రీనివాస్ నాయక్, అమీనాబాద్ పీఏసీఎస్ చైర్మన్ మురహరి రవి, జల్లి సర్పంచ్ సుధాకర్,బానోత్ దేవా, వార్డు మెంబర్ హలవత్ రాజు, కిషన్, బాలు, వాలు, నవీన్, రమేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొర్లకుంట మీదుగా ఇసుక అక్రమ రవాణా

- **పట్టించుకోని సంబంధిత అధికారులు**
- **బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణ చందర్**



**మహాముత్తారం,ఏప్రిల్ 8. ప్రజా జ్యోతి** మండలంలోని ఓ ప్రజా ప్రతినిధి భర్త, అధికార పార్టీ నాయకుడు సూత్రధారిగా మాదారం శివారులోని పెద్ద వాగు నుండి కొర్లకుంట గ్రామం మీదుగా గత నెల రోజులుగా అక్రమంగా ఇసుక అక్రమ రవాణా నడుస్తున్న సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణ చందర్ ఓ ప్రకటనలో ఆరోపించారు.సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అక్రమ రవాణా అడ్డుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు పట్టించుకొని తీరుపై అనుమానంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో బాగు చేసిన మట్టి రహదారిలో అధిక లోడ్ ట్రాక్టర్లు తిరిగి దారి గుంతల మయంగా తయారైందన్నారు. సదరు నాయకుడు ప్రతి ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.3వందలు అక్రమంగా వసూలు చేస్తున్నాడని, ప్రతి రోజు పదివేలకు పైగా అక్రమ ఆదాయం పొందుతున్నారని, ఇప్పటివరకు చేసిన అక్రమ ఆదాయాన్ని బయటికి తీసి దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆయన కోరారు. ఇసుక అక్రమ వ్యాపారం అరికట్టక పోతే ఆందోళనలను తప్పవని హెచ్చరించారు.

## రైతులు గాలికుంటు వ్యాది టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**రాయపర్తి ఏప్రిల్ 8 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాయపర్తి గ్రామంలోని పశువుల ఆసుపత్రి వద్ద గురువారం ఉదయం 8.00గం లకు గేదెలకు , ఆవులకు మరియు ఎడ్లకు పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాలు వేయడం జరుగుతుందికావున రైతులు అందరూ తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోగలరు ముఖ్య గమనిక రైతులు తమ పశువులను తీసుకువచ్చేటప్పుడు వారి యొక్క ఆధార్ కార్డు మరియు ఫోన్ వెంట తెచ్చుకో వాలని రాయపర్తి పశు వైద్య శాఖ అధికారులు తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిలను విజయవంతం చేయండి

- **తాసిల్దార్ దండు శ్రీనివాస్**



**మహాముత్తారం,ఏప్రిల్ 8. ప్రజాజ్యోతి**మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఈనెల 11న బోర్లగూడెంలో 14న మహాముత్తారం మండల కేంద్రంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతిలను విజయవంతం చేయాలని మహాముత్తారం తాసిల్దార్ దండు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఎంపీడీఓ ప్రకాష్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ బాబా షేక్ లతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు.మహనీయుల జయంతిలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సావ కమిటీ అధ్యక్షులు లింగమళ్ళ దుర్గయ్య ఉపాధ్యక్షులు ముక్కెర రాజమల్లు ప్రధాన కార్యదర్శి లింగమళ్ళ శంకర్ కార్యదర్శి పంగ సంపత్, భూక్యా భాస్కర్,కోశాధికారి రామగిరి రాజుకార్యవర్గ సభ్యులు పీక కిరణ్, గంధం రాజు,పంగ సురేందర్,బొబ్బిలి రాజు, తైనేని సంపత్,ముక్కెర వెంకటస్వామి,వెంకటయ్య లింగమళ్ళ రాజయ్య, వేముల మధుకర్ లు పాల్గొన్నారు.

## శివగంగేశ్వర మండపానికి భూమి పూజ



**వరంగల్, ఏప్రిల్ 08(ప్రజాజ్యోతి):** నగరంలోని రంగశాయిపేట శివారు జక్కలొద్ది దగ్గర గల దామెర చెరువు సమీపంలో శివగంగేశ్వర మండప నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దామెర చెరువు స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పురోహితులు జాగర్లపూడి కోటయ్య శర్మ వేదమంత్రాల మధ్య భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలు, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దామెర చెరువులో ప్రతిరోజు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది స్విమ్మర్స్ ఈత కొట్టి అనంతరం గంగా పూజ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. చెరువు తూర్పు భాగంలో కాకతీయుల కాలానికి చెందిన గణపతి మండపం, చెరువు కట్టపై మైసమ్మ దేవాలయం ఉన్నాయని తెలిపారు. పడమర దిశలో శివుడి తలపై గంగ ఉన్న రూపంలో విగ్రహాన్ని ప్రతిష్టిస్తే శుభఫలితాలు కలుగుతాయని పండితులు సూచించడంతో ఈ ఆలయాన్ని "శివగంగేశ్వర మండపం"గా పేరు పెట్టినట్లు వివరించారు. మండప నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శేర్ల అనిల్ కుమార్ రూ.11,111, అంకతి రాజేందర్ రూ.10,111, తాడెం కుమార్ రూ.10,111, గై కిషోర్ రూ.10,000, తేలు భాస్కర్ రూ.5,000 విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మునుకుంట్ల రాములు, గౌరవ అధ్యక్షుడు అంకతి రాజేందర్, ఉపాధ్యక్షులు తాడెం కుమార్, జక్కుల రాందేవ్, అప్పల సత్యనారాయణ, గోధుమల రాజు, కాసర్ల భాస్కర్, కత్తెరపల్లి వేణు, మందాటి రవి, మురికి రవి, అట్ల రాజు, విశ్వం, పస్తం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్న ఎమ్మెల్యే



**ఖానాపురం /ఏప్రిల్: 8(ప్రజా జ్యోతి)** ఖానాపురం మండల కేంద్రంలోని మార్కెట్ లో మార్క్ఫెడ్ వారితో పిఎసిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని రైతులు, సర్పంచులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

# వలస ఆదివాసి గూడాలపై ఫారెస్ట్ దాడులు నిలిపివేయాలి





- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి దావూద్ డిమాండ్**

**ఏటూర్ నాగారం ఏప్రిల్ 08 ప్రజా జ్యోతి** గుత్తి కోయ గూడెంలోని ప్రజలంతా పనులకు వెళ్లిన సమయంలో ఫారెస్ట్ అధికారులు గంటలగుంట అనే గూడెంలో అనేక సంవత్సరాలుగా సాగు చేస్తున్న పోడు భూములలో వందలాది ఎకరాలు పారెస్టులో కలుపుకోనుటకు ట్రెంచ్ తవ్వడం జరిగిందని పోడువ్యవసాయం ప్రారంభంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ లేదా అని ఫారెస్ట్ అధికారులను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి దావూద్ ప్రశ్నించారు. ఆనాడు కొంతమంది అధికారులు డబ్బులు తీసుకొని చూసి చూడనట్లు నటించి అడవి మొత్తం నాశనం అయిన తర్వాత ఇంతకాలం శ్రమించి సాగు చేసుకున్న భూములను ఫారెస్ట్ లో కలుపుకోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో సీతక్క ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో ఉండి పోడు వ్యవసాయదారులకు కొత్తది నరికేది లేదు పాతది వదిలిపెట్టేది లేదు అని అనేక మీటింగుల్లో చెప్పి ఇప్పుడు అధికారంలో మంత్రిగా ఉండి ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్ లు కొడుతుంటే తెలవడం లేదా అని ప్రశ్నించారు. గూడెం ను సిపిఎం బృందం సందర్శించడానికి వెళ్లేటప్పటికె ఒక ఆవు ఈరోజు ఫారెస్ట్ అధికారులు తీసిన కందకంలో కాళ్లు పైకి తల క్రిందికి పడి చివరి ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఆ నోరులేని ఆవుని ఆ గూడెం ప్రజలు కాపాడినారు. ప్రస్తుతానికి ఎంతవరకు సాగులో ఉందో అంతవరకు వదిలిపెట్టి కొత్త పోడు చేయకుండా ఫారెస్ట్ ను ఆనుకొని ట్రెంచ్ తీసుకోవడం మంచిదని అధికారులకు సూచించారు. లేనిపక్షంలో అన్ని గ్రామాల పోడు వ్యవసాయదారుల్ని సమీకరించి ఉద్యమాలు ఉధృతం చేస్తామని దావూద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎల్ రవి పార్టీ మండల కమిటీ సభ్యులు. సమ్మయ్య జోగయ్య సురేష్ నాగేష్ లతోపాటు గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## కొడకండ్ల పిహెచ్సి ని 50 పడకల ఆసుపత్రిగా పెంచడం కోసం సర్వే ప్రారంభం

**కొడకండ్ల, ఏప్రిల్ 08 ( ప్రజాజ్యోతి ):** ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి కొడకండ్ల మండలంలోని పిహెచ్సి ని 50 పడుకల ఆస్పత్రిగా అప్డేట్ చేయాలని స్పీకర్ ద్వారా సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ ను కోరడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి నరేంద్ర శర్మ బుధవారం మండల కేంద్రంలో ఆసుపత్రి కి కావలసిన అదనపు స్థలం గూర్చి తహసిల్దార్ అనిల్ బాబు ను కోరారు. ఆసుపత్రికి సమీపంలో ఉన్న భూమిని ఆసుపత్రికి కేటాయించమని కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రి కి అనుకూలంగా ఉన్న స్థలాన్ని కేటాయిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి నరేంద్ర శర్మ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి కోరిక మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ ఆదేశాల మేరకు కొడకండ్ల ప్రాంతంలోని ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంచడం జరుగుతుందని, దీనీవల్ల వల్ల ఇక్కడ ప్రజలకు అనేక సౌకర్యాలు కలుగుతాయని ఆరోగ్య సమస్యలు తీరుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరికృష్ణ, హెల్త్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మె







**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** విద్యుత్ ఆర్టిజన్ అన్ మ్యాన్డ్,పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టివిఏఇ జేఏసి పిలుపుమేరకు బుధవారం విధులను బహిష్కరించి ములుగు జిల్లాకు చెందిన ఆర్టిజన్ కార్మికులు ములుగు డివిజన్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు.ఈ నిరవధిక సమ్మె ములుగు జిల్లా అధ్యక్షుడు సాయిబాబా ఆధ్వర్యంలో కొనసాగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని,ఏపిఎస్ఇబి రూల్స్ వర్తింపచేయాలని కోరారు.మిగిలి ఉన్న అన్ మ్యాన్డ్,పీస్ రేట్ కార్మికులను ఆర్టిజన్ లను సంస్థలో విలీనం చేసుకోవాలని కోరారు.ఈ సమ్మెకు మద్దతుగా సంస్థలో ఉన్న ట్రేడ్ యూనియన్లు అన్ని మద్దతుగా ఉన్నాయని కార్మికులు ఎవరు అధైర్య పడవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, రమేష్,జయరాజ్,శంకర్, మహేందర్,ఆరోగ్యం,నాగేశ్వర రావు,రాజు,గోపి,విజయ్, సుధాకర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థులకు ప్రతిభను వెలికి తీయవచ్చు

- **ఉమ్మడి పరీక్షల కార్యదర్శి గారే కృష్ణమూర్తి**





**రాయపర్తి ఏప్రిల్ 8 ప్రజా జ్యోతి** జిల్లా విద్యాశాఖ అధికారి వరంగల్ బి రంగయ్య నాయుడు ఆదేశాల మేరకు నేటి నుండి18/04/2027 వరకు నిర్వహించబడుతున్న సమ్మేటివ్ అసెస్మెంట్ -2 (ఎస్ .ఎం -2)పరీక్షల పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి వరంగల్ గారే.కృష్ణమూర్తి రాయపర్తి మండలం లోని కె జి బి వి తిరుమలయ పల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలయ పల్లి మరియు పీఎం శ్రీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కొండూరు లను సందర్శించారు. ఈ విద్యా సంవత్సరము 2025-26 నిర్వహించబడుతున్న సమ్మేటివ్ అసెస్మెంట్ -2 1వ,తరగతి నుండి 9వ తరగతి పరీక్షలను పర్యవేక్షిస్తూ విద్యార్థిని విద్యార్థులు అందరూ కూడా పరీక్షలకు హాజరై పరీక్షలు రాయాలని కోరారు. పరీక్షలు రాయడం వలన విద్యార్థుల ప్రతిభను వెలికి తీయవచ్చు నని విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలు రాయడంతో ఆత్మస్థైర్యం,రాతనైపులను పెరపొందించుకోవచ్చు అన్నారు. ఇట్టి పరీక్షలను ప్రభుత్వం ఇచ్చినటువంటి షెడ్యూల్ కనుగుణంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను కోరారు. ప్రధాన ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలలో పనిచేస్తున్నటువంటి సబ్జెక్ట్ వారి ఉపాధ్యాయులకు పరీక్షలు అయిపోగానే విద్యార్థులు రాసినటువంటి జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే విధంగా చూడాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన వేసవి సెలవుల కంటే ముందే అన్ని జవాబు పత్రాలు మూల్యాంకనం చేసి విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రగతి పత్రాలు అందజేయాలని కోరారు ఇట్టి కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత జడ్.పి.హెచ్.ఎస్ తిరుమలాయపల్లి ప్రధానోపాధ్యాయురాలుసంధ్యారాణి పీఎం శ్రీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కొండూరు ప్రధానోపాధ్యాయురాలు ఏ పద్మలత నరసింహులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు